క్లుప్తంగా

సమయపాలన పాటించాలని భక్తుల ఆగ్రహం


అపరిశుభ్రంగా ఆలయ పరిసరాలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని శ్రీదుబ్బమల్లికార్జునస్వామి దేవాలయం అతి పురాతనమైనది. డిసెంబర్ 1న ప్రారంభమైన స్వామివారి జాతర ఉగాది వరకు కొనసాగుతోంది. ప్రతిరోజు ఉదయం 5గంటలకు శ్రీమల్లికార్జునస్వామికి అభిషేకం, అలంకరణ, నైవేద్యం సమర్పించిన తర్వాత భక్తులు దర్శనం చేసుకుంటారు. శెట్టి వారాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేస్తారు. శుక్రవారం ఉదయం 8 గంటల వరకు గుడి తలుపులు తెరవకపోవడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతర సమయంలోనైనా అధికారులు, పూజారులు సమయపాలన పాటించాలన్నారు. పూజారి రాజును వివరణ కోరగా అనారోగ్యం కారణంగా ఆలస్యంగా వచ్చామన్నాడు. ఈవో సుభద్ర వివరణ కోసం ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

దుప్పట్ల పంపిణీ

చొప్పదండి: పట్టణంలోని జామా మసీద్‌లో దురల్ ఖైర్ సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేద మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలకు చైర్మన్ డాక్టర్ ఖుద్దూస్, ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు జహీరొద్దీన్, జమా మసీద్ అధ్యక్షుడు అబీద్ అలీ 150 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హఫీజ్ రిజ్వాన్, నజీబ్ అహ్మద్, జమాల్, అజీమ్ ఖాన్, సమీనా సుల్తానా, ఇమామ్ సాజిద్ అలీ, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం


అవార్డు అందిస్తున్న నాయకులు

వీణవంక: మండలంలోని మాల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కళాకారుడు గోనెల సమ్మన్నకు ఉత్తమ కళాకారుడిగా గుర్తింపు దక్కింది. పీపుల్స్ మూమెంట్ సంస్థ ఆధ్వర్యంలో కళాకారులు, ఉద్యమకారుల పురస్కార ప్రాధానోత్సవం శుక్రవారం హుస్నాబాద్‌లో జరిగింది. సమ్మన్న సేవలకు ఉత్తమ కళాకారుడిగా మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి, మాజీ మేయర్ రవీందర్‌సింగ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సమ్మన్న మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో పాటలు పాడానని, కళాకారులను గుర్తించి అవార్డు ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈసందర్భంగా సమ్మన్నను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పీపుల్స్ మూమెంట్ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, మల్లేశ్, తదితరులున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

హుజూరాబాద్: రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులకు సంబంధించిన అన్నిరకాల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ఉద్యోగుల గెజిటెడ్ ఆఫీసర్స్, నాన్ గెజిటెడ్ టీచర్స్, పెన్షనర్లు, కార్మికుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ హుస్సేన్ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఛీఫ్ సెక్రటరీలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం పట్టణంలో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు అనేక రకాల ఇబ్బందులు పడుతున్నారని, పదవీ విరమణ పొంది డబ్బులు జమవుతాయని ఎదురుచూస్తున్నారని, ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం


పార్టీ జెండా ఎగరేస్తున్న కార్యదర్శి రవి

హుజూరాబాద్: సీపీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ కూడలి వద్ద పార్టీ జెండాను మండల కార్యదర్శి గోవిందుల రవి ఎగురవేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం మొట్టమొదటిసారిగా సంపూర్ణ స్వరాజ్యం కావాలని నినాదాలిచ్చి, నమ్ముకున్న సిద్ధాంతం కోసం మతం, కులం, ప్రాంతం పేరిట రాజకీయం చేయకుండా సమసమాజ స్థాపన నినాదంతో పని చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ మాత్రమేనని అన్నారు. ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, ఆవాసం, ఉపాధి, కార్మిక భద్రత తదితర హక్కులు కేవలం కమ్యూనిస్టు ప్రభుత్వాలతోనే సాధ్యమని, నేడు ప్రజలు నిత్య అవసరాలు తీర్చుకోవడానికి అనేక కష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. మహిళా సమిక్ష జిల్లా సహాయ కార్యదర్శి శారద, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా సహాయ కార్యదర్శి రాము, ఏఐవైఎఫ్ కన్వీనర్ లంకదాసరి కళ్యాణ్, నాయకులు గరిగె రాములు,సంపత్,అనిల్ కుమార్,రవి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రమాదాలకు చౌరాస్తా

- తరుచూ రోడ్డు ప్రమాదాలు
- ట్రాఫిక్ నియంత్రణ కరువు
- నాలుగువైపులా కబ్జాకు గురవుతున్నా రోడ్డు, పట్టించుకోని అధికారులు


గంగాధర చౌరస్తా

గంగాధర: కరీంనగర్–జగిత్యాల జాతీయ ప్రధాన రహదారిలో నాలుగు మండలాలు, నలభైకి పైగా గ్రామాలకు కూడలి అయిన గంగాధర చౌరస్తా నాలుగు వైపులా కబ్జాకు గురవుతోంది. ట్రాఫిక్ నియంత్రణ కరువై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజలు ప్రాణాలు కోల్పోతుండటంతో చౌరస్తా కాస్త చావురాస్తాగా మారింది. ప్రమాదాలతో ప్రజల ప్రాణాలు పోతున్నా అధికారులు, నాయకులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కురిక్యాల మాజీ ఎంపీటీసీ సభ్యుడు అల్వోజి నందయ్య తీవ్ర గాయాలపాలై ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. పలువురు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గతంలో తడిగొండ గ్రామానికి చెందిన చేపూరి శ్రీలత ఎనిమిదేళ్ల కుమారుడు అక్షయ్‌తో రోడ్డు దాటుతుండగా బైక్ ఢీ కొట్టడంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రద్దీ కారణంగా చిన్నా,పెద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు గతంలో రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయకుండా, కూరగాయల వ్యాపారులు రోడ్డు మీద నిర్వహించకుండా, ఆటోల అడ్డాను ప్రధాన రహదారికి దూరంగా తరలించడంతో ప్రమాదాలు నివారించగలిగారు. కొద్ది రోజుల తర్వాత పరిస్థితి మళ్లీ యథావిధిగా తయారైంది. నాలుగు వైపులా వంద ఫీట్ల రోడ్డు కాస్త ముప్పై ఫీట్లకే పరిమితమైంది. చిరువ్యాపారులు పోటీ పడి రోడ్డు మీదికి వస్తుంటే వాహనాలను రోడ్డు మీదనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డు మీద చిరు వ్యాపారులతో పాటు వాహనాల పార్కింగ్‌తో దుకాణదారులు సైతం ఇబ్బంది పడుతున్నారు. ప్రమాదాల నివారణకు చౌరస్తాలో నలువైపుల భారీ కేడ్లు ఏర్పాటు చేయాలని, రోడ్ల మీదికి వస్తున్న కూరగాయలు, పండ్లు, పానీపూరి, ఇతర వ్యాపారాల బండ్లను తొలగించాలని, రోడ్డుపై పార్కింగ్ చేస్తున్న వాహనాలను తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



గంగాధర చౌరస్తాలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరగకుండా కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారి, బోయినిపల్లి రోడ్డులో భారీకేడ్లు ఏర్పాటు చేయాలి. రోడ్డు మీద వాహనాలు పార్కింగ్ చేయకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పిట్టల శ్రీనివాస్, వెంకంపల్లి



హుజూరాబాద్: మండలంలోని పెద్దపాపయ్యపల్లె గ్రామం ప్రధాన వీధుల్లో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డంకిగా మారాయి. గాలి, వానకు షార్ట్ సర్క్యూట్‌తో తరుచుగా మంటలు ఏర్పడుతున్నాయని, విద్యుత్ అంతరాయం కలుగుతుందని చెట్ల కొమ్మలను తొలగించాలని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సంతోష్‌కుమార్, రూరల్ ఏఈ, సెల్ నంబర్: 85001 20227

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఘనంగా మహా పడిపూజ


రామడుగు: శోభాయాత్రలో భక్తులు, తదితరులు


చొప్పదండి: పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో మహా పడిపూజను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయ పదో వార్షికోత్సవంలో భాగంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మండపంలో భాష్యం శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పోలోజు చరణాచార్యుల సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా భక్తులు భజనలతో హోరెత్తించారు. 108 కళాశాలతో అయ్యప్పభక్తులు స్వామివారి ఉత్సవ మూర్తికి జలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఆలయ చైర్మన్ బొడిగె వెంకటేశ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, సీనియర్ మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

గోపాల్‌రావుపేటలో హనుమాన్ శోభాయాత్ర

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేటలో శుక్రవారం హనుమాన్ శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. గ్రామంలో నిర్మించిన శ్రీహనుమాన్ దేవాలయంలో భక్తాంజనేయస్వామి సహిత శివపంచాయతన దేవతా విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమంలో శుక్రవారం హనుమాన్ దేవాలయం నుంచి రథంపై దేవతామూర్తులను ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు, ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


తనిఖీ నిర్వహిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్: వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తేతే చర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో మాట్లాడారు. డిసెంబర్ 31 దృష్టిలో పెట్టుకొని స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. జమ్మికుంట రోడ్, హుజూరాబాద్ ప్రధాన చౌరస్తాతో పాటు బస్ డిపో క్రాస్ వద్ద పోలీసులు విస్తృత తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేశారు. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లతో పాటు బస్టాండు, పాన్ షాప్, లాడ్జీ తదితర ప్రాంతాలు తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల వివరాలు సేకరించారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. డిసెంబర్ 31 రాత్రి 12 గంటల తర్వాత రోడ్ల పై మద్యం తాగి విచ్చలవిడిగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అనంతరం హుజూరాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలందరికీ నూతన శుభాకాంక్షలు తెలిపారు. వేరువేరుగా నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో పట్టణ సీఐ తిరుమల్‌గౌడ్, రూరల్ సీఐ పులి వెంకట్‌గౌడ్, ఎస్సై యూనస్ అమ్మద్ అలీ,సైదాపూర్ ఎస్ఐ సీహెచ్ తిరుపతి, శంకరపట్నం ఎస్సై కె రవికుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మికుంట: నూతన సంవత్సర వేడుకల్లో అవాంఛనీయ, అసాంఘిక కార్యకలపాలకు పాల్పడిన చర్యలు తీసుకుంటామని శ్రీనివాస్‌జి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, వివిధ షాపుల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. గంజాయి, డ్రగ్స్, మత్తుపదార్థాలు సరఫరా, వినియోగించినా ప్రజలకు ఇబ్బందులు తలెత్తే విధంగా ప్రవర్తించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. న్యూ ఇయర్ వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అనంతరం పట్టణ ప్రజలు, యువతకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ సీఐ వరంగంటి రవి, వీణవంక, ఇల్లందకుంట ఎస్ఐలు తిరుపతి, రాజ్‌కుమార్, ప్రొబిషనరీ ఎస్ఐ భార్గవ్ పోలీసులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహానికి మాజీ సర్పంచుల వినతి


గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న మాజీ సర్పంచులు

చిగురుమామిడి: తమ హయాంలో నిర్మించిన గ్రామపంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే జీపీలకు తాళాలు వేస్తామని మాజీ సర్పంచ్‌లు ఆరోపించారు. శుక్రవారం చిగురుమామిడిలోని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక అప్పుల్లో కూరుకుపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు జక్కుల రవి, సన్నీల్ల వెంకటేశం, బెజ్జంకి లక్ష్మణ్, గోలి బాపురెడ్డి, నాగెల్లి వకులాలక్ష్మారెడ్డి, ముప్పిడి వెంకటనర్సింహారెడ్డి, చెప్యాల మమత శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


చొప్పదండిలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు


సైదాపూర్‌లో...

మన్మోహన్‌సింగ్‌కు నివాళి

సాక్షి నెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతిపట్ల కాంగ్రెస్ నాయకులతోపాటు పలువురు నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆర్థికవేత్త, కేంద్ర మంత్రిగా, ప్రధానిగా అనేక సేవలందించారని పేర్కొన్నారు. తెలంగాణ ఆకాంక్షను నెరవేర్చి ప్రత్యేక రాష్ట్ర బిల్లును ప్రధానిగా తన సంతకంతో ఆమోదించారని, ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు.


శంకరపట్నంలో..


చిగురుమామిడిలో...


హుజూరాబాద్‌లో...


జమ్మికుంటలో..


రామడుగు: వెలిచాలలో..


ఇల్లందకుంటలో...

నేడు విద్యుత్ సరఫరా బంద్

హుజూరాబాద్: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పట్టణ ఏఈ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వినియోగదారుల సహకరించాలని కోరారు.

29న క్రీడా పోటీలు

వీణవంక: మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో 29న నెహ్రూ యువ కేంద్రం, యువ చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు యూత్ అధ్యక్షుడు కర్రె నాని తెలిపారు. గ్రామంలోని పాఠశాల ఆవరణలో కబడ్డీ, షటిల్, రన్నింగ్, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని, వివరాలకు 9989139012 సంప్రదించాలని సూచించారు.

నేడు ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక సదస్సు

చిగురుమామిడి: మండలపరిషత్ కార్యాలయం ఎదుట శనివారం ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూధన్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. 15వ విడతలో భాగంగా 17 గ్రామపంచాయితీల్లో 1–ఏప్రిల్ 2023 నుంచి 31 మార్చి 2024 వరకు నిర్వహించిన ఈజీఎస్ పనులపై సామాజిక తనిఖీ చేశామన్నారు. గతేడాది ఆడిట్ నివేదికను ప్రజావేదికలో చర్చించనున్నామని ఈజీఎస్ కూలీలు సమావేశంలో పాల్గొని అభ్యంతరాలు తెలియజేయాలన్నారు.

క్రైం వార్తలు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

జమ్మికుంట: చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందాడని టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు. మండలంలోని శాయంపేట గ్రామానికి చెందిన అకినపల్లి భద్రయ్య (73) ఈ నెల 16న ఎక్సెల్‌పై వెళ్తూ అదుపు తప్పి కింద పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడని, భద్రయ్య కుమారుడు అకినపల్లి స్వామి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

ఒకరిపై కేసు

గన్నేరువరం: బైక్‌ను ఢీకొట్టిన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఏఎస్సై కిషన్ తెలిపారు. మండలంలోని హన్మాజిపల్లె గ్రామానికి చెందిన సొల్లు మల్లేశం, రమేశ్ గురువారం రెండు బైక్‌లపై సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వరుకోలులో శుభకార్యానికి వెళ్లుతున్నారు. గుండ్లపల్లి చెరువు కట్ట మూలమలుపు వద్ద మల్లేశం బైక్‌ను కారు ఢీకొట్టింది. ప్రమాదంలో మల్లేశం తలకు తీవ్ర గాయాలు కాగా భార్య తారకు స్వల్ప గాయాలయ్యాయని సొల్లు రమేశ్ ఫిర్యాదుతో శుక్రవారం కారు డ్రైవర్ బూరి రాజ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. మల్లేశం పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించామని కుటుంబసభ్యులు తెలిపారు.

సమాధులు కూల్చారని ఫిర్యాదు

శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామం ఖబ్రస్తాన్‌లో సమాధులు కూల్చిన వ్యకులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం ముస్లింలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి తీవ్రగాయాలు

హుజూరాబాద్: పట్టణంలోని వరంగల్ రోడ్డు పరకాల క్రాస్ వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. జాతర ముగించుకొని కరీంనగర్ నుంచి హన్మకొండకు వెళ్తున్న టాటా ట్రాలీ, పర్కాల నుంచి హుజూరాబాద్‌కు బైక్‌పై వెళ్తున్న మండలంలోని జూపాక గ్రామానికి చెందిన కొండపాక సుమన్, తాళ్లపల్లి భరత్‌ను ఢీకొట్టింది. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా 108లో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. పట్టణంలోని వరంగల్‌రోడ్డు పాత రిలయన్స్ బంకు సమీపంలో బొలేరా వాహనం అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టి డివైడర్‌కు తగిలి బోల్తా పడింది. ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.స్థానికులు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఆమె చూపు సజీవం


భవాని(ఫైల్)

హుజూరాబాద్: పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన గౌరిశెట్టి భవాని గురువారం గుండెపోటుతో మృతిచెందగా.. ఆమె కళ్లను దానం చేశారు. జమ్మికుంట వ్యాపారి కాసం నగేశ్ సమాచారం మేరకు.. గర్రెపల్లి వెంకటేశ్వర్లు డీలర్, రావి కంటి రాజేందర్, యోగా గురువు నరహరి నేత్రదానంపై ఆమె కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంతో.. యోగా గురువు, సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి ఆధ్వర్యంలో వరంగల్ ఎల్వీపీ టెక్నీషియన్ రాజేంద్రప్రసాద్ సహకారంతో నేత్ర సేకరణ చేసి హైదరాబాద్ ఎల్వీపీ ఐ బ్యాంక్ పంపించారు. ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన భర్త గౌరిశెట్టి శ్రీనివాస్, కూతురు సంయుక్త, సహకరించిన వంగల రమేశ్ జిరాక్స్, గర్రెపల్లి వెంకటేశ్వర్లు, డీలర్ కాసం నగేశ్, రావికంటి రాజేందర్, బంధుమిత్రులకు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, ముఖ్య సలహాదారు నూక రమేశ్, గౌరవ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శి వాసు, చంద్రమౌళి అభినందనలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కరీంనగర్: రాష్ట్రంలో నాయీబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా ప్రయత్నం చేయాలని కోరుతూ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంజపడుగు హరిప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఆలయాల్లో గల కల్యాణకట్టలో పనిచేస్తున్న నాయీబ్రాహ్మనులను శాశ్వత ఉద్యోగులుగా నియమించాలన్నారు. 50 ఏళ్లు దాటిన వారికి నేత, గీత కార్మికులకు ఇచ్చే వృద్ధాప్య పెన్షన్‌లాంటి పథకాన్ని వర్తింపజేసేలా శాసనమండలిలో ప్రస్తావన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మానాల కిషన్, గొగ్గుల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు నడిగొట్టు సంతోష్, శ్రీరాముల రమేష్, గర్శకుర్తి విద్యనగర్, వెముగడ్డ వరమేష్ సురంపల్లి పర్శారం తదితరులు పాల్గొన్నారు.